సాక్షి
నల్లగొండ
శనివారం । 29 । జూన్ । 2024



ఉన్నతంగా మహిళా కళాశాల
సరస్వతీ నిలయంగా మారిన నల్లగొండలోని మహిళా డిగ్రీ కళాశాలలో చేరేందుకు విద్యార్థినులు ఆసక్తి చూపుతున్నారు. - 8లో



పాతాళ భైరవి నాటక ప్రదర్శన
యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ మాడవీధిలో ప్రదర్శించిన పాతాళ భైరవి నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. - 8లో

గరిష్టం / కనిష్టం
28° / 25°
వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

టెన్త్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

- 78.03 శాతం ఉత్తీర్ణత

రామగిరి(నల్లగొండ) : పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. జిల్లాలో 801 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 625 మంది ఉత్తీర్ణులయ్యారు. 78.03 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా డీఈఓ భిక్షపతి మాట్లాడుతూ పరీక్ష ఫలితాలను www. bre.telangana.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు వెల్లడించారు. రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ కమ్ ఆన్సర్ బుక్‌లెట్‌ను పొందడానికి జూలై 8వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. రీ కౌంటింగ్‌కు సబ్జెక్టుకు రూ.500, రీ వెరిఫికేషన్ కమ్ ఆన్సర్ బుక్‌లెట్ కోసం సబ్జెక్టుకు రూ.వెయ్యి చెల్లించాలన్నారు. దరఖాస్తులను టీటీటీ. ఘుఞ్చ్ఏ ఙఞ్జ్ఛ్.జౌరి.జీ ఞ నుంచి పొందవచ్చన్నారు. రీ కౌంటింగ్ దరఖాస్తు ఫారమ్‌ను హైదరాబాద్ పరీక్షల కార్యాలయంలో, రీ వెరిఫికేషన్ కమ్ ఆన్సర్ బుక్‌లెట్ దరఖాస్తులను నల్లగొండ డీఈఓ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.

ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేయాలి



డిపో ఆవరణలో మొక్క నాటి నీరు పోస్తున్న ఆర్‌ఎం రాజశేఖర్

దేవరకొండ : ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులు సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని ఆర్‌ఎం రాజశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన దేవరకొండ డిపోను సందర్శించారు. డిపో పరిధిలో నడుస్తున్న బస్సులు, కార్మికులు, ఉద్యోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉద్యోగులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రయాణికులకు ఆర్టీసీ అందిస్తున్న మెరుగైన సేవలను సిబ్బంది, అధికారులు చేరువ చేయాలని సూచించారు. దేవరకొండ డిపోను రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిపేందుకు సమష్టిగా కృషి చేయాలన్నారు. అనంతరం ఉత్తమ ఉద్యోగులను సన్మానించి డిపో ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎం మాధవి, ఇన్‌చార్జి డీఎం పాల్, అసిస్టెంట్ మేనేజర్ సైదులు, ఎంఎఫ్ సునీత పాల్గొన్నారు.

డీసీసీబీలో జీఎంల బదిలీ

ఖమ్మం వ్యవసాయం : జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ)ల్లో పనిచేస్తున్న జనరల్ మేనేజర్లను కామన్ పూల్ విధానంలో సొంత జిల్లాలకు బదిలీ చేస్తూ టస్కాబ్(తెలంగాణ రాష్ట్ర సహకార బ్యాంక్) ఎండీ టి.జ్యోతి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా 13మంది సొంత జిల్లాలకు బదిలీ అయ్యారు. ఇందులో భాగంగానే ఖమ్మం జీఎం కాకర్ల నర్మదను నల్లగొండ డీసీసీబీకి, నల్లగొండ జీఎం వి.వసంతరావును ఖమ్మం బదిలీ చేశారు. ఇటీవలే డీజీఎంలు, ఏజీఎంలను బదిలీ చేసిన టస్కాబ్ ప్రస్తుతం జీఎంలను సైతం బదిలీ చేయగా, ఒకటి, రెండు రోజుల్లో వారు కొత్త స్థానాల్లో విధుల్లో చేరే అవకాశముంది.

మహిళలకు సమానత్వం కల్పించాలి



మాట్లాడుతున్న ఐద్వా కేంద్ర కమిటీ సభ్యురాలు జ్యోతి

భానుపురి (సూర్యాపేట) : మహిళలకు రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో సమానత్వం కల్పించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) కేంద్ర కమిటీ సభ్యురాలు జ్యోతి అన్నారు. శుక్రవారం సూర్యాపేటలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన ఐద్వా జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మద్యం, డ్రగ్స్‌ను నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు. పదేళ్ల కాలంలో మహిళలపై దేశవ్యాప్తంగా హత్యలు, అత్యాచారాలు పెరిగాయని, అనేక చట్టాలు వస్తున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరిగా అమలు చేయడం లేదని ఆరోపించారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలన్నారు. సమభావన సంఘాల మహిళలకు ప్రభుత్వమే ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి మేకనబోయిన సైదమ్మ, రాష్ట్ర కమిటీ సభ్యురాలు మద్దెల జ్యోతి, జూలకంటి విజయలక్ష్మి, అండం నారాయణమ్మ, భాగ్యమ్మ, లక్ష్మి, జ్యోతి, సృజన, లక్ష్మి, మణెమ్మ, పద్మ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కే సహకారం!

డీసీసీబీ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం

- అవిశ్వాసానికి అనుకూలంగా చేతులెత్తిన 15 మంది డైరెక్టర్లు
- పదవి కోల్పోయిన బీఆర్‌ఎస్ నేత మహేందర్‌రెడ్డి
- జూలై 1వ తేదీన చైర్మన్ ఎన్నిక
- కాంగ్రెస్ వశం కానున్న డీసీసీబీ
- నూతన చైర్మన్‌గా కుంభం శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికయ్యే అవకాశం



అవిశ్వాసం నెగ్గిన తర్వాత విజయ సంకేతం చూపుతున్న డీసీసీబీ డైరెక్టర్లు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) పీఠం కాంగ్రెస్ పార్టీ వశం కానుంది. ఇప్పటివరకు చైర్మన్‌గా వ్యవహరించిన బీఆర్‌ఎస్ నాయకుడు గొంగిడి మహేందర్‌రెడ్డిపై డైరెక్టర్లు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. శుక్రవారం డీసీసీబీ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి 15 మంది హాజరై అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా చేతులెత్తడంతో మహేందర్‌రెడ్డి చైర్మన్ పదవిని కోల్పోయారు. దీంతో వైస్ చైర్మన్‌గా ఉన్న దయాకర్‌రెడ్డిని ఇన్‌చార్జి చైర్మన్‌గా నియమించారు. మహేందర్‌రెడ్డితోపాటు ఆయన వెంట ఉన్న ముగ్గురు డైరెక్టర్లు సమావేశానికి హాజరుకాలేదు. జూలై 1వ తేదీన చైర్మన్ పదవికి ఎన్నిక నిర్వహిస్తామని జిల్లా సహకార అధికారి ప్రకటించారు. మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అనుచరుడు, మునుగోడు పీఏసీఎస్ చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి కొత్త చైర్మన్‌గా ఎన్నిక కానున్నట్లు తెలుస్తోంది.

మ్యాజిక్ ఫిగర్ దాటి..

డీసీసీబీ అవిశ్వాస సమావేశానికి మ్యాజిక్ ఫిగర్ దాటి డైరెక్టర్లు హాజరు కావడంతో అవిశ్వాసం నెగ్గింది. కుంభం శ్రీనివాస్‌రెడ్డి పక్కా వ్యూహంతో వ్యవహరించి తమవైపు ఉన్న ఒక్క డైరెక్టర్ కూడా వెనక్కి వెళ్లకుండా కాపాడుకోవడంలో సక్సెస్ అయ్యారు. ఈ నెల 10వ తేదీన అవిశ్వాసం నోటీసు ఇచ్చిన నాటి నుంచి 17 రోజుల పాటు వారు తనవెంటే ఉండేలా చూడగలిగారు. డీసీసీబీలోని మొత్తం 19 మంది డైరెక్టర్లలో 10 మంది కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నా సహకార చట్టం నిబంధనల ప్రకారం అవిశ్వాసం నెగ్గాలంటే కనీసంగా 14 మంది (మూడింట రెండో వంతు) ఉండాల్సిందే. అందుకు అనుగుణంగానే కుంభం శ్రీనివాస్‌రెడ్డి 14 మంది మద్దతు కూడగట్టగలిగారు.



విలేకరులతో మాట్లాడుతున్న కుంభం శ్రీనివాస్‌రెడ్డి, పక్కన ఇన్‌చార్జి చైర్మన్, డైరెక్టర్లు

మహేందర్‌రెడ్డికి నిరాశే..

డీసీసీబీలో మొత్తం డైరెక్టర్లు 19 మందిలో మొదట్లో కాంగ్రెస్ పార్టీకి ఒక్క డైరెక్టరే ఉన్నారు. మిగతా 18 మంది బీఆర్‌ఎస్‌కు చెందిన వారే. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎనిమిది మంది బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటయ్యాక వైస్ చైర్మన్‌గా ఉన్న ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరడంతో కాంగ్రెస్ బలం 10కి చేరింది. బీఆర్‌ఎస్‌కు చెందిన మరో ఐదుగురు డైరెక్టర్లు కాంగ్రెస్ వైపే మొగ్గుచూపారు. చైర్మన్ మహేందర్‌రెడ్డితో పాటు ప్రవీణ్‌రెడ్డి, రంగాచారి, అప్పిరెడ్డి మాత్రమే బీఆర్‌ఎస్ వైపు ఉన్నారు. ఆయన వెంట కేవలం ముగ్గురే ఉన్నా.. అవిశ్వాసం వీగిపోయేందుకు చివరి వరకు ప్రయత్నం చేశారు. అవిశ్వాసం వీగిపోవాలంటే 14 మంది సమావేశానికి హాజరు కాకుండా ఉండాలి. అందుకే కాంగ్రెస్ వైపునకు వెళ్లిన ఐదుగురిలో ఇద్దరిని వెనక్కి తీసుకొచ్చేందుకు మహేందర్‌రెడ్డి అన్ని ప్రయత్నాలు చేశారు. పార్టీ నిర్ణయానికి కట్టుబడి వెనక్కి రావాలంటూ వారితో చర్చలు జరిపినా ఫలితం దక్కలేదు.

రైతు సంక్షేమమే ధ్యేయంగా..

- డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్ రెడ్డి

డీసీసీబీని పార్టీలకతీతంగా రైతు సంక్షేమ ధ్యేయంగా ముందుకు తీసుకుపోతామని డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అవిశ్వాస తీర్మానం నెగ్గిన అనంతరం మీడియాతో మాట్లాడారు. నల్లగొండ డీసీసీబీపై మరోసారి కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరబోతోందన్నారు. బ్యాంకును అభివృద్ధి చేస్తూ రైతులకు అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. గత పాలకులు డీసీసీబీకి రాజకీయ రంగు పులిమి ఇష్టానుసారంగా వ్యవహరించారని విమర్శించారు. తాము రాజకీయాలకు అతీతంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. బ్యాంకు డైరెక్టర్లు, అధికారులు, ఉద్యోగుల సలహాలు సూచనలతో రైతుల సంక్షేమం కోసం పనిచేస్తామన్నారు. రైతుల సంక్షేమం కోసమే అవిశ్వాస తీర్మానం పెట్టి నెగ్గించుకున్నామన్నారు. ఇందుకు సహకరించిన మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, మాజీ మంత్రులు కుందూరు జానారెడ్డి, రాంరెడ్డి దామోదర్ రెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, డైరెక్టర్లకు ధన్యవాదాలు తెలిపారు. మీడియా సమావేశంలో డీసీసీబీ వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్, నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, నల్లగొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్లు పాశం సంపత్ రెడ్డి, అంజయ్య, గుడిపాటి సైదులు, వీరస్వామి, కొండా సైదులు, కోడి సుష్మ, కరుణ, అనురాధ, అందేల లింగయ్య యాదవ్, రామచంద్రయ్య, జూలూరు శ్రీనివాస్, జయరాం నాయక్, బంటు శ్రీనుతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

డిండి ప్రాజెక్టు నుంచి నీటి విడుదల

డిండి : డిండి ప్రాజెక్టు నుంచి వానాకాలం సాగుకు శుక్రవారం దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్, నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందన్నారు. రైతులు నీటిని వృథా చేయకుండా ఆయకట్టు చివరి భూములకు అందేలా చూడాలన్నారు. పంట చివరి దశ వరకు నీరందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించే రిజర్వాయర్లకు ప్రభుత్వం నుంచి సరిపడా నిధులు మంజూరు చేయించి పెండింగ్ పనులను పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ శ్రీధర్‌రావు, ఎంపీపీ సునీతా జనార్దర్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొంతినేని వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాజేష్‌రెడ్డి, కొర్ర రాంసింగ్, మేకల కాశన్న, సాయికుమార్, భీముడు, రాములు, వెంకటేష్, శ్రీను, భాస్కర్ రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, రేఖ్యానాయక్, లక్పతినాయక్, బుచ్చిరెడ్డి, మైనోద్దీన్, శైలేష్ పాల్గొన్నారు.



నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యేలు బాలూనాయక్, వంశీకృష్ణ

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ ఎన్జీ కళాశాలలో వివిధ సబ్జెక్టుల్లో ఖాళీగా ఉన్న గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు 2, వాణిజ్య శాస్త్రం 3, బీబీఏ 3, కంప్యూటర్ సైన్స్/అప్లికేషన్స్ 6, డాటా సైన్స్ 1, మ్యాథ్స్ 2, స్టాటిస్టిక్స్ 1, బయోటెక్నాలజీ 1 సబ్జెక్టుల్లో ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. నెట్, సెట్, పీహెచ్‌డీ, బోధన అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు జూలై 2వ తేదీలోగా దరఖాస్తును కళాశాలలో సమర్పించాలని తెలిపారు. జూలై 3వ తేదీన నిర్వహించే ఇంటర్వ్యూలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

మిర్యాలగూడ : సీజనల్ వ్యాధులపై వైద్యులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌ఓ కల్యాణ్‌చక్రవరి అన్నారు. శుక్రవారం దామరచర్లలోని యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్‌లో కార్మికులకు ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించి కార్మికులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ కార్మికుల ఆరోగ్యంపై వైద్యులు శ్రద్ధ వహించాలన్నారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య చేపట్టి దోమలను నివారించాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కేసారవి, మండల వైద్యాధికారి నాగేశ్వర్‌రావు, ఉపేందర్, రఫి, మలేరియా నియంత్రణ అధికారి దుర్గయ్య తదితరులు ఉన్నారు.



వైద్యుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌ఓ కల్యాణ్‌చక్రవర్తి

బొగ్గు గనులను సింగరేణికే కేటాయించాలి



నల్ల బ్యానర్‌తో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

నల్లగొండ టౌన్ : బొగ్గు గనులను సింగరేణి సంస్థకే అప్పగించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, తీగల సాగర్, జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సుభాష్‌చంద్రబోస్ విగ్రహం వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో వారు మాట్లాడారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బొగ్గు గనులను ప్రైవేటీకరణ చేయాలని చూస్తోందన్నారు. ప్రభుత్వ వెంటనే తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రైతుభరోసా ఎకరానికి రూ.7500 చొప్పున ప్రభుత్వం వెంటనే అందించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బండా శ్రీశైలం, నర్సింహ, నన్నూరి వెంకటరమణారెడ్డి, దేవిరెడ్డి అశోక్‌రెడ్డి, రాగిరెడ్డి మంగారెడ్డి, అరూరి శ్రీను, వెంకన్న, కుంభం కృష్ణారెడ్డి, కె.శ్రీనివాస్‌రెడ్డి, మర్రి వెంకటయ్య, కంచర్ల ఉర్మిలమ్మ, గోవిందరెడ్డి పాల్గొన్నారు.

ఎస్సెల్బీసీ పూర్తికి ప్రభుత్వం సిద్ధం

- కలెక్టర్ నారాయణరెడ్డి
- ఎస్పీతో కలిసి ఎస్సెల్బీసీ టన్నెల్, నక్కలగండి కట్ట నిర్మాణ పనుల పరిశీలన



నక్కలగండి కట్ట నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

చందంపేట : ఎస్సెల్బీసీ పనులను పూర్తి చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోందని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం చందంపేట మండలంలోని మన్నెవారిపల్లి సమీపంలో ఎస్సెల్బీసీ ఔట్‌లెట్ పనులతో పాటు నక్కలగండి కట్ట నిర్మాణ పనులను ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ప్రాజెక్టు ఏజెన్సీ ప్రెసిడెంట్ అనిల్‌కుమార్ ఎస్సెల్బీసీ గురించి కలెక్టర్‌కు వివరించారు. 43.93 కిలోమీటర్ల మేర చేపడుతున్న ఈ టన్నెల్ ప్రపంచంలోనే 5వ అతిపెద్దది కానుందని కలెక్టర్‌కు వివరించారు. డ్రిల్లింగ్ మిషన్ టీబీఎం పనితీరును కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు టన్నెల్–2 నుంచి సుమారు కిలోమీటర్ మేర ట్రాక్ ద్వారా లోపలికి వెళ్లి పరిశీలించారు. అనంతరం తెల్దేవర్‌పల్లి గ్రామ పరిధిలోని మోత్యతండా సమీపంలో నక్కలగండి కట్ట నిర్మాణ పనులను పరిశీలించారు. కలెక్టర్ వెంట దేవరకొండ ఆర్డీఓ శ్రీరాములు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.సత్యనారాయణ, డీఈ బి.చక్రపాణి, లలిత, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు మహేందర్, రవిరాజ్, జయప్రకాష్, జయప్రకాష్, ఏజీఎంలు దీపక్‌జైన్, వీరేందర్‌సింగ్, డీఎస్పీ గిరిబాబు, ఎంపీపీ పార్వతి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ లక్ష్మి, సీఐ సురేష్, లచ్చిరాంనాయక్, భరత్‌కుమార్ తదితరులున్నారు.



ఎస్సెల్బీసీ టన్నెల్ వద్ద ఇంజనీర్లతో కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తదితరులు

నిర్వాసితులకు న్యాయం చేస్తాం

- ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మర్రిగూడ : శివన్నగూడ రిజర్వాయర్‌లో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు, ముంపు గ్రామస్తులకు పూర్తిస్థాయిలో న్యాయం చేసేందుకు కృషి చేస్తామని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మర్రిగూడ మండలంలోని శివన్నగూడ ప్రాజెక్టు వద్ద ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీని అందించే విధంగా కృషి చేస్తానన్నారు. నాడు కేసీఆర్ అవగాహన లోపంతో ప్రాజెక్టు పనులను ప్రారంభించి కాలయాపన చేశారన్నారు. పైప్రాంతంలో ఉన్న ప్రాజెక్టు పూర్తి కాకుండా దిగువన ఉన్న శివన్నగూడ రిజర్వాయర్‌కు నీరు ఎలా తెస్తారని కేసీఆర్‌ను ప్రశ్నించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలకు పనులకు సహకరించాలని.. ముంపు గ్రామాల వారికి చింతపల్లి లేదా రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో పునరావాసం కల్పించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు.



శివన్నగూడ రిజర్వాయర్ వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

ఎరువులు అధిక ధరలకు విక్రయించొద్దు

- జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్

పెద్దవూర : యూరియా, ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ అధికారి పాల్వాయి శ్రవణ్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం పెద్దవూర మండలంలోని తుంగతుర్తి గ్రామంలో పంట పొలాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి సాగుపై రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఏఓ, ఏఈఓ, పురుగుల మందుల డీలర్లతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. దుఖాణాల్లో విధిగా నోటీస్ బోర్డుపై స్టాక్ వివరాలను నమోదు చేయాలని సూచించారు. రైతులకు ఉపయోగపడే మందులను మాత్రమే విక్రయించాలన్నారు. కార్యక్రమంలో ఏవో సందీప్, మునిరెడ్డి, లక్ష్మారెడ్డి, లక్ష్మణ్, సైదులు, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పత్తి చేనును పరిశీలిస్తున్న డీఏఓ శ్రవణ్‌కుమార్

జీజీహెచ్‌లో సేవలకు అంతరాయం

- తీవ్ర ఇబ్బందులు పడిన రోగులు

నల్లగొండ టౌన్ : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో డాక్టర్లు అందుబాటులో ఉండటం లేదని ఆరోపణలు వస్తున్నా వైద్యులకు పట్టడం లేదు. ప్రభుత్వం ఆసుపత్రిలో వివిధ అంశాలను పరిశీలించేందుకు జిల్లా అధికారులను నియమించినా కొందరు ప్రభుత్వ వైద్యుల్లో మార్పు రావడంలో లేదు. వివిధ సమస్యలతో బాధపడుతున్న వారు చికిత్స కోసం రావడంతో ఓపీ విభాగం సిబ్బంది వారికి చిట్టీలను రాసి ఇచ్చారు. వారంతా ఆయా ఓపీ విభాగాలకు చెందిన గదుల వద్ద ఉదయం 9గంటల నుంచి బారులుదీరారు. ఆందోళన నేపథ్యంలో వైద్యులు మాత్రం ఎక్కడా కనిపించలేదు. శుక్రవారం చెవి, ముక్కు, గొంతు, కంటి, స్కిన్, ఆర్థో విభాగాల్లో ఒక్క డాక్టర్ లేకుండాపోయారు. మిగతా విభాగాల ఓపీ సేవల్లో జూనియర్, సీనియర్ డాక్టర్లు ఉన్నా, ఈ విభాగాలకు జూనియర్ డాక్టర్లు అయినా వస్తారో రారో అన్న విషయం కూడా చెప్పే వారు లేకపోవడంతో ముఖ్యంగా వృద్ధులు నానా ఇబ్బందులకు గురయ్యారు. జనరల్ మెడిసిన్, డెంటల్ విభాగాల ఓపీలలో సీనియర్ డాక్టర్లు ఎవరూ విధులకు హాజరు కాలేదు. అయితే జూనియర్ డాక్టర్లు ఆయా విభాగాల్లో సేవలు అందించారు. ఐసీయూ, మాతాశిశు ఆరోగ్య కేంద్రం, అత్యవసర సేవల విభాగంలో మాత్రం సీనియర్ డాక్టర్లు , జూనియర్ డాక్టర్లు పని చేశారు. మెడికల్ కళాశాల, జీజీహెచ్‌లోని అన్ని విభాగాలకు చెందిన సీనియర్ డాక్టర్లు హెచ్‌ఓడిలు, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు నిరసనలో పాల్గొనడంతో రోగులు చాలా ఇబ్బందులు పడాల్సి వచ్చింది.



ఓపీ విభాగాల వద్ద బారులుదీరిన రోగులు



ఖాళీగా ఉన్న కంటి పరీక్షల వార్డు

నిరసన విరమించిన వైద్యులు

నల్లగొండ, నల్లగొండ టౌన్ : నల్లగొండలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్)ను జిల్లా అధికారులు తనిఖీ చేసే విషయంలో వైద్యులు చేపట్టిన నిరసన శుక్రవారం విరమించారు. నలుగురు సభ్యులతో కూడిన బృందం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్రతో చర్చలు జరిపింది. ఈ చర్చలు సఫలమయ్యాయి. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఆస్పత్రి పర్యవేక్షకులు ఏర్పాటు చేసిన ఒక ఆర్‌ఎంఓతో కలిపి ఆస్పత్రిని జిల్లా అధికారులతో తనిఖీ చేసేందుకు ఎలాంటి అభ్యంతరం లేదని వైద్యులు ఒప్పుకున్నారని తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే విషయంలో అందరూ కలిసి పని చేయాలని నిర్ణయించుకున్నారని పేర్కొన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎంపిక చేసిన ఆర్‌ఎంఓతో కలిసి జిల్లా అధికారులు యథావిధిగా ఆస్పత్రిలో ప్రజలకు అవసరమైన పరిపాలనపరమైన విభాగాలను తనిఖీ చేస్తారని తెలిపారు. చర్చలు జరిపిన వారిలో నల్లగొండ మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ జె.శ్రీకాంత్‌వర్మ, ఎల్.రమేష్, ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలంగాణ డాక్టర్ల బోధనా సిబ్బంది అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, జోనల్ కార్యదర్శి, సూర్యాపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ గిరిధర్ నాయక్, జీజీహెచ్ సూపరింటెండెంట్ నిత్యానందం ఉన్నారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి


శ్రీనివాసచారి

గుర్రంపోడు : చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందిన సంఘటన శుక్రవారం గుర్రంపోడు మండల కేంద్రంలో జరిగింది. ఎస్ఐ బి.శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. నాంపల్లి మండలం నేర్లపల్లి గ్రామానికి చెందిన బొడ్డోజు శ్రీనివాసచారి (40) గుర్రంపోడు మండల కేంద్రంలో స్థిరపడ్డాడు. ఈ నెల 24న తన కుమారుడిని మోడల్ స్కూల్ నుంచి ఇంటికి తీసుకుని వస్తుండగా.. ఎదురుగా వస్తున్న బైక్ శ్రీనివాసచారిని బలంగా ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతడిని నల్లగొండ ఆస్పత్రికి తరలించారు. ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. శ్రీనివాసచారి మామ నారోజు సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

600 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం


బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

కొండమల్లేపల్లి : మండల పరిధిలోని కేశ్యతండా, మేగ్యతండాలలో శుక్రవారం దేవరకొండ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. 600 లీటర్ల బెల్లం పానకాన్ని గుర్తించి ధ్వంసం చేసినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ మల్లేష్, వై.వేణుగోపాల్‌రెడ్డి, కృష్ణ, శేఖర్‌రెడ్డి, నాగరాజు, అనిల్, మహేశ్ పాల్గొన్నారు.

గీతకార్మికుడికి గాయాలు

వలిగొండ : మండలంలోని రెడ్లరేపాక గ్రామానికి చెందిన మార్క బాలనరసింహ వృత్తిరీత్యా గీతకార్మికుడు. బాలనరసింహ రోజు మాదిరిగా కల్లు తీయడానికి శుక్రవారం తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన చుట్టుపక్కలవారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు వెంటనే బాలనరసింహను చికిత్స నిమిత్తం భువనగిరి ఆస్పత్రికి తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

ఉన్నతంగా మహిళా డిగ్రీ కళాశాల

- 1972లో తొమ్మిది మందితో నల్లగొండ పట్టణంలో ప్రారంభం
- నేడు మూడు వేల మంది విద్యార్థినులు
- స్వయం ప్రతిపత్తి కలిగిన కళాశాల
- దోస్త్ ద్వారా అడ్మిషన్లు



నల్లగొండలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, కంప్యూటర్ నేర్చుకుంటున్న విద్యార్థినులు

నల్లగొండ రూరల్: నల్లగొండ పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాల సరస్వతీ నిలయంగా మారింది. ఉమ్మడి జిల్లాలో ఏకైక మహిళా డిగ్రీ కాలేజీ కావడంతోపాటు అత్యుత్తమ బోధన అందిస్తుండడంతో ఈ కళాశాలలో చేరేందుకు ఉమ్మడి జిల్లాల విద్యార్థినులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ కళాశాలలో 8 కోర్సుల ద్వారా విద్యార్థినులకు విద్యను అందిస్తున్నారు. సబ్జెక్టుల్లో చాయిస్ బేస్‌డ్ పద్ధతిలతో బోధన జరుగుతోంది. స్వయం ప్రతిపత్తి కలిగిన మహిళా డిగ్రీ కళాశాలలో అన్ని రకాల సౌకర్యాలతో రెండు షిఫ్టులుగా విద్యా బోధన జరుగుతోంది. దోస్త్ ద్వారా 2015–16 నుంచి ఆన్‌లైన్‌లో అడ్మిషన్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

గత ఏడాది కళాశాలకు న్యాక్ ఏ గ్రేడ్

నల్లగొండ పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాలకు గత ఏడాది న్యాక్ 'ఏ'గ్రేడ్ ప్రకటించింది. 1972లో కేవలం 9 మంది విద్యార్థినులతో ప్రారంభమై నేడు మూడు వేల మంది విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. కళాశాలలో అధునాతన భవనాలు, విశాలమైన తరగతి గదులు, క్రీడా మైదానం, సెమినార్ హాల్, ప్రయోగ శాలలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, తాగునీటి వసతి, గ్రంథాలయం ఉన్నాయి. పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలు, మ్యాగజైన్లు గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయి.

వివిధ రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థినులు

ఈ కళాశాలలో చదివిన విద్యార్థినులు గత ఏడాది పీజీ ఎంట్రెన్స్ టెస్టులో ఉత్తమ ర్యాంకులు సాధించారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో రాణించేందుకు విద్యార్థినులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఈ కళాశాలలో చదివిన విద్యార్థినులు ఎంతోమంది ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించిన పోటీ పరీక్షలో కళాశాలకు చెందిన బొజ్జ భవానికి ఇటీవల ఉద్యోగం రాగా.. జిల్లా కోర్టులో స్టెనోగ్రాఫర్‌గా మరో విద్యార్థిని చందన ఎంపికైంది. అంతర్ విశ్వవిద్యాలయాల క్రీడాపోటీలు, జాతీయ స్థాయి క్రీడల్లో ఈ కళాశాలకు చెందిన విద్యార్థినులు ప్రతిభ చూపుతున్నారు. కళాశాలకు చెందిన విద్యార్థిని ఎం.సరయు తైక్వాండో పోటీలో జాతీయ స్థాయిలో రిఫరీగా ఎంపికైంది. గత ఏడాది నలుగురు విద్యార్థినులు అంతర్ విశ్వవిద్యాలయాల క్రీడా పోటీల్లో పాల్గొని బంగారు పతకాలు సాధించారు.

మహిళా కళాశాలలో అందించే కోర్సులివే..

కోర్సు	మీడియం
బీఏ	ఉర్దూ
బీఏ	ఇంగ్లిష్
బీఏ	తెలుగు
బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్	ఇంగ్లిష్
బీఎస్సీ లైఫ్‌సైన్స్	ఇంగ్లిష్
బీఎస్సీ ఫిజికల్ సైన్స్	ఇంగ్లిష్
కంప్యూటర్ సైన్స్ హానర్స్	ఇంగ్లిష్

ఉన్నత విద్య అందించాలనే లక్ష్యంతో..

మహిళా డిగ్రీ కళాశాల నల్లగొండ పట్టణం నడిబొడ్డున ఉండడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థినులకు ఇబ్బందులు లేకుండాపోయాయి. పేద, మధ్య తరగతి కుటంబాలకు చెందిన వారు తమ పిల్లలకు ఉన్నత విద్య అందించాలనే లక్ష్యంతో ఈ కళాశాలలో చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు. కోదాడ, సూర్యాపేట, భువనగిరి నుంచి విద్యార్థినులు వచ్చి ఈ కళాశాలలో విద్యనభ్యసిస్తున్నారు. కొందరు విద్యార్థినులు హాస్టల్‌లో, బంధువుల ఇళ్లల్లో, బస్‌ల్లో వచ్చి కళాశాలలో విద్యనభ్యసిస్తున్నారు. ఈ కళాశాలలో మహిళలకు డిగ్రీలో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ బ్రాంచ్ కూడా ఉంది.

విద్యార్థినుల భవిష్యత్‌కు జాబ్ మేళా



విద్యార్థినుల భవిష్యత్ కోసం డిగ్రీ ఫైనలియర్‌లో జాబ్‌మేళా నిర్వహించి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తున్నాం. విద్యార్థినుల్లో పోటీతత్వం పెంచేందుకు క్రీడల్లో ప్రోత్సహించడంతోపాటు ఎన్ఎస్ఎస్ యూనిట్లు ఏర్పాటు చేశాం. జాతీయ సెమినార్లు నిర్వహించి విద్యార్థినుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీస్తున్నాం.

– ఘనశ్యాం, ప్రిన్సిపాల్

పోటీ పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నాం



విద్యార్థినులు అన్ని పోటీ పరీక్షల్లో రాణించేవిధంగా గ్రంథాలయంలో పోటీ పరీక్షల పుస్తకాలు, జర్నల్స్ అందుబాటులో ఉంచాం. ఇంటర్నెట్ సౌకర్యంతో గ్రంథాలయం విద్యార్థినులకు అందుబాటులో ఉంది. విద్యార్థినులు పోటీ పరీక్షలకు సన్నద్ధం అయ్యేలా ప్రత్యేక శిక్షణ అందిస్తున్నాం.

– ఎస్. రాజారామ్, గ్రంథపాలకుడు

మమ్ముల్ని విడిచి వెళ్లొద్దు మాస్టారూ..

- సోమాజీపల్లి, పోలుమల్ల గ్రామాల ఉపాధ్యాయుల బదిలీ
- వెళ్లొద్దని కాళ్లు పట్టుకుని బోరున ఏడ్చిన విద్యార్థులు


పోలుమల్లలో ఉపాధ్యాయుడి వద్ద కూర్చుని ఏడుస్తున్న విద్యార్థులు

మద్దిరాల : విద్యార్థి జీవితంలో గురువుకు ప్రత్యేక స్థానం ఉంటుంది. ప్రతి ఒక విద్యార్థి ఎదుగుదలలో గురువుల పాత్ర ఎనలేనిది. విద్యార్థులతో అలాంటి బంధం పెనవేసుకున్న గురువు దూరమైతే ఆ బాధ వర్ణణాతీతం. మద్దిరాల మండల పరిధిలోని పోలుమల్ల గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 14 సంవత్సరాలుగా తెలుగు పండిట్‌గా మెంతబోయిన సైదులు పనిచేస్తున్నారు. ఎంతో మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించారు. విద్యార్థులందరితో ఎంతో ప్రేమగా మెలిగేవారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఆయన పోలుమల్ల పాఠశాల నుంచి నూతనకల్ మండల పరిధిలోని ఎర్రపహాడ్ ప్రభుత్వ పాఠశాలకు బదిలీ అయ్యారు. శుక్రవారం పాఠశాల నుంచి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడిని విద్యార్థులు మీరు మమ్మల్ని విడిచి వెళ్లొద్దు సార్ అంటూ ఏడ్చుకుంటూ ఉపాధ్యాయుడి కాళ్లు పట్టుకుని వేడుకున్నారు. దీంతో ఆ విద్యార్థులు చూపించిన ప్రేమకు ఉపాధ్యాయుడు సైతం కన్నీరు పెట్టుకున్నారు. విద్యార్థులకు ఉపాధ్యాయుడికి మధ్య ఉన్న అనుబంధం గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులను కట్టిపడేసింది. చూసేవారిని కంట తడిపెట్టేలా చేసింది.

సోమాజీపల్లి గ్రామంలో..

బొమ్మలరామారం : మండలంలోని సోమాజీపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ప్రదీప్ కన్నా పదోన్నతిపై రాజపేట మండలం బేగంపేట జెడ్పీ హైస్కూల్‌కు బదిలీ అయ్యారు. గురువారం ఆయన పాఠశాల నుంచి రిలీవ్ అయ్యారు. దీంతో విద్యార్థులు ప్రదీప్ కన్నా చుట్టూ చేరి మన స్కూల్ నుంచి మీరు పోవద్దంటూ కంటతడి పెడుతు కాళ్లు పట్టుకుని ప్రాధేయపడ్డారు. సార్ మమ్ముల్ని విడిచిపెట్టి వెళ్లొద్దంటూ బోరున విలపించారు. వారి రోదనలతో ఉపాధ్యాయుడు ప్రదీప్ కన్నా సైతం భావోద్వేగానికి గురై కంటతడి పెట్టాడు. 12 సంవత్సరాల క్రితం మారుమూల ప్రాంతమైన సోమాజీపల్లి తండా ప్రాథమిక పాఠశాలలో రోడ్డు సౌకర్యం సైతం సరిగా లేని రోజుల్లో ప్రదీప్ కన్నా విధుల్లో చేరారు. పాఠశాలలో విద్యార్థుల చేరికలను పెంచుతూ దాతల సహకారంతో విద్యార్థులకు నోట్‌బుక్స్, పాఠశాలకు మౌలిక వసతులు కల్పిస్తూ పాఠశాలను సమర్థంగా నిర్వహించారు. పాఠశాలతోపాటు గ్రామస్తులతో 12 ఏళ్ల అనుబంధాన్ని పెంచుకోవడంతో పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సైతం బరువెక్కిన హృదయంతో ప్రదీప్ కన్నాకు వీడ్కోలు పలికారు.

విద్యార్థుల ప్రేమ మరువలేనిది



విద్యార్థులు నాపై చూపిన ప్రేమ ఎప్పటికీ మరిచిపోలేను. వాళ్లు ఏడుస్తుంటే నాకు కూడా కన్నీళ్లు ఆగలేదు. ఉద్యోగంలో బదిలీలు సహజం. నేను ఎక్కడ ఉన్నా విద్యార్థుల మంచిని కోరుకుంటా. వారికి ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా అందిస్తా.

– మెంతబోయిన సైదులు, ఉపాధ్యాయుడు


ఉపాధ్యాయుడు ప్రదీప్ కన్నాను పట్టుకుని రోదిస్తున్న విద్యార్థులు

రోడ్డు ప్రమాదంలో సెంట్రింగ్ మేస్త్రి మృతి


యూసుఫ్ (ఫైల్)

నేరేడుచర్ల : రోడ్డు ప్రమాదంలో ఓ సెంట్రింగ్ మేస్త్రి మృతి చెందిన సంఘటన శుక్రవారం నేరేడుచర్ల మండలంలోని చిల్లేపల్లి వద్ద చోటుచేసుకుంది. నేరేడుచర్ల ఎస్ఐ రవీందర్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్ల మండల కేంద్రంలోని రాజీవ్ నగర్‌కు చెందిన సెంట్రింగ్ మేస్త్రి ఎస్‌కె.యూసుఫ్ (55) సెంట్రింగ్ పనుల నిమిత్తం కోదాడ– జడ్చర్ల ప్రధాన జాతీయ రహదారిపై మిర్యాలగూడకు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఈక్రమంలో చిల్లేపల్లి చెరువు సమీపంలోకి రాగానే.. కడప నుంచి జగ్గయ్యపేట వైపు కెమికల్ లోడ్‌తో వెళ్తున్న డీసీఎం డ్రైవర్ బాషబోయిన సిద్దరామయ్య ఎదురుగా వస్తున్న యూసుఫ్ ద్విచక్రవాహనాన్ని అతివేగంగా ఢీకొట్టాడు. దీంతో యూసుఫ్ బైక్‌పైనుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఏడాది క్రితం మృతి చెందగా.. మృతుడికి వివాహం అయినా ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీందర్‌నాయక్ తెలిపారు.

ఇద్దరు యువకుల రిమాండ్

చిట్యాల: మంచినీరు కావాలని ఓ ఇంటికి వెళ్లి, ఆ ఇంట్లోని వృద్ధురాలి మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడు లాక్కెళ్లిన ఇద్దరు యువకులను శుక్రవారం పోలీసులు రిమాండ్ చేశారు. చిట్యాల ఎస్ఐ డి.సైదాబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 24వ తేదీన చిట్యాల మండలం పిశాటిగూడెం గ్రామానికి చెందిన పిశాటి సుగుణమ్మ ఇంటి వద్దకు నలుగురు యువకులు రెండు బైక్‌లపై వచ్చారు. తాగేందుకు మంచినీరు కావాలని ఆమెను అడిగారు. అనంతరం ఇద్దరు యువకులు ఆమె వెంట ఇంటిలోపలికి వెళ్లి ఆమె మెడలోని బంగారు పుస్తెలతాడును లాక్కుని బైక్‌లపై పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు చిట్యాల పోలీసులు కేసు నమోదు చేశారు. పుస్తెల తాడు దొంగిలించిన చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన సంపంగి కల్యాణ్, మరో బాలుడిని ఎస్ఐ సైదాబాబు ఆధ్వర్యంలో సాంకేతిక పరిజ్ఞానం సహకారంతో పట్టుకుని రిమాండ్ చేశారు. కాగా అంకిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. దొంగిలించిన పుస్తెలతాడును రికవరీ చేసి బాధితురాలికి అందజేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. పరారీలో ఉన్న మరో ఇద్దరు యువకులను త్వరలో పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు.

మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ

గరిడేపల్లి : మహిళ మెడలోనుంచి బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తి లాక్కెళ్లిన సంఘటన గరిడేపల్లి మండల పరిధిలోని అబ్బిరెడ్డిగూడెం ఆవాసం సుభాష్‌నగర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ ఈట సైదులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన గాదే నరసమ్మ తన పెసర చేను వద్దకు వెళ్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి కొంత దూరంలో బైక్ ఆపాడు. మహిళ వద్దకు వెళ్లి క్రషర్ మిల్లుకు ఎలా వెళ్లాలని అడిగి ఆమె మెడలో ఉన్న మూడు తులాల బంగారు తాడును లాక్కుని బైక్‌పై అక్కడి నుంచి పారిపోయాడు. గాదే నరసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పంప్ హౌస్‌లో చెట్లు నరికివేత


ట్రాక్టర్‌లోకి ఎక్కించేందుకు సిద్ధంగా ఉంచిన చెట్ల మొద్దులు

చింతపల్లి : మండల పరిధిలోని నసర్లపల్లిలో గల హైదరాబాద్ మెట్రో వాటర్ ప్లాంట్‌లో ఐదు రోజుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా భారీ వృక్షాలను నరికివేయడం చర్చనీయాంశంగా మారింది. వాటర్ ప్లాంట్ వెనుక భాగంలో గుట్టుచప్పుడు కాకుండా గోడపైకి స్టాండ్ల సహాయంతో ఎక్కి పంప్‌హౌస్‌లో ఉన్న భారీ వృక్షాలను కూలీల సహాయంతో నరికివేసి ట్రాక్టర్లు, లారీల ద్వారా భారీస్థాయిలో రవాణా చేస్తున్నట్లు పలువురు రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికే లక్షల రూపాయల విలువైన చెట్లను నరికి అమ్మకానికి తరలించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పంప్‌హౌస్‌లో చెట్ల నరికివేతకు ఫారెస్ట్ అధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అయితే ఎలాంటి అనుమతులు లేకుండా గుట్టుచప్పుడు కాకుండా అధికారుల అండదండలతో బయటి వ్యక్తులు ఈ అక్రమ కలప రవాణాకు పాల్పడుతున్నట్లు సమాచారం.

అబార్షన్ ఘటనలో ఏడుగురిపై కేసు

సూర్యాపేట టౌన్ : పుట్టబోయేది ఆడపిల్ల అని స్కానింగ్‌లో తెలుసుకుని భార్యకు అబార్షన్ చేయించి ఆమె మృతికి కారణమైన కేసులో భర్తతో పాటు మరో ఆరుగురిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్టు సూర్యాపేట పట్టణ సీఐ రాజశేఖర్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. చివ్వెంల మండల పరిధిలోని ఎంజీనగర్ తండాకు చెందిన హరిసింగ్‌తో మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం వెన్నారం గ్రామ పంచాయతీ పరిధిలోని రాముతండాకు చెందిన భట్టు కృష్ణ కుమార్తె సుహాసినికి 2019లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు. కుమారుడి కోసం మూడో కాన్పు ఉంచుకున్నారు. అయితే ఏడు నెలల గర్భవతి అయిన సుహాసినికి స్కానింగ్ చేయించగా ఆడపిల్ల అని తేలడంతో ఆమెకు ఎలాగైనా అబార్షన్ చేయించాలని హరిసింగ్ నిర్ణయించుకున్నాడు. హుజూర్‌నగర్‌లోని కమల ఆస్పత్రిలో సుహాసినికి అబార్షన్ చేయించాడు. అయితే ఆపరేషన్ వికటించి ఆమె పరిస్థితి విషమించడంతో కోదాడ, ఖమ్మం, సూర్యాపేటలోని పలు ఆస్పత్రులకు తీసుకెళ్లగా ఆమె అప్పటికే మృతి చెందిందని వైద్యులు చెప్పారు. తమ కుమార్తె మృతికి కారణమైన హరిసింగ్‌తోపాటు కుటుంబ సభ్యులు, ఆస్పత్రి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని సూర్యాపేట పట్టణ పోలీసు స్టేషన్‌లో సుహాసిని తండ్రి భట్టు కృష్ణ ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసినట్టు సీఐ రాజశేఖర్ తెలిపారు. ఈ కేసులో భర్త హరిసింగ్‌తోపాటు మృతురాలి అత్త, ఇద్దరు ఆడపడుచులు, కమల ఆస్పత్రి యాజమాన్యమైన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. ఈ కేసును చివ్వెంల స్టేషన్‌కు బదిలీ చేసినట్టు సీఐ తెలిపారు.

రాచకాల్వ గేటు అపహరణ

భువనగిరి క్రైం : చిన్నేరు వాగుపై బొల్లెపల్లి పెద్దచెరువు కాలువ కత్వకు గల గేటును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్లు సిరివేణికుంట మాజీ సర్పంచ్ పడాల అనిత వెంకటేశ్ తెలిపారు. అధికారులు విచారణ జరిపి దండగులను పట్టుకోవాలని, గేటుకు మరమ్మతులు చేయాలని కోరారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు కనుకుంట్ల బాబురావు, బొర్ర ప్రభాకర్, రైతులు బొర్ర గోపాల్, సిద్దగోని కష్ణమూర్తి, యంజాల యాదగిరి, బొర్ర నరేష్ ఉన్నారు.

కోతుల దాడిలో మహిళకు గాయాలు

నూతనకల్ : కోతులు దాడి చేసి మహిళను గాయపర్చిన సంఘటన నూతనకల్ మండల పరిధిలోని చిల్పకుంట్ల గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. చిల్పకుంట్ల గ్రామానికి చెందిన పోతుగంటి నాగమ్మ పని నిమిత్తం బయటకు వెళ్లి ఇంటికి తిరిగి వచ్చేసరికి కోతులు ఇంట్లో ఉన్నాయి. మహిళ రావడాన్ని గమనించిన కోతులు ఒక్కసారిగా ఆమెపై దాడి చేసి రెండు చేతులను తీవ్రంగా గాయపరిచాయి. కోతులు దాడిచేస్తున్న సమయంలో ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చేసరికి అవి వెళ్లిపోయాయి. గాయపడిన మహిళను చికిత్స నిమిత్తం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.



రఘునాథపాలెంలో..

మఠంపల్లి: మండలంలోని రఘునాథపాలెంలో కోతుల గుంపు దాడి చేయడంతో శుక్రవారం నాయుడు వెంకటేశ్వర్లు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వెంకటేశ్వర్లును స్థానికులు హుజూర్‌నగర్ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యంకోసం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

మిర్యాలగూడ టౌన్ : పేకాట స్థావరంపై రూరల్ పోలీసులు గురువారం రాత్రి దాడులు నిర్వహించారు. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం అవంతీపురం గ్రామ శివారులో గల డంపింగ్ యార్డు వద్ద కొంతమంది పేకాడుతున్నారనే సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. అయితే పోలీసులు వస్తున్నారని తెలుసుకున్న నలుగురు వ్యక్తులు పరారీ కాగా మరో ఇద్దరు పోలీసులకు చిక్కారు. మొత్తం ఆరుగురిపై కేసు నమోదు చేశామని, ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రెండు మోటారు సైకిళ్లు, రూ.43,940 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యాదాద్రిలో పాతాళ భైరవి నాటక ప్రదర్శన



పాతాళ భైరవి నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ ఉత్తర మాడవీధిలో సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శ్రీవినాయక నాట్య మండలి (సురభి) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాటక ప్రదర్శన శుక్రవారం రెండోరోజుకు చేరింది. సాయంత్రం 7గంటల నుంచి రాత్రి 9గంటల వరకు పాతాళ భైరవి నాటకాన్ని కళాకారులు ప్రదర్శించారు. పాతాళ భైరవి, తోట రాముడు, ఇందుమతి, మాంత్రికుడు, యక్షిణి కన్య వంటి పాత్రల్లో కళాకారుల ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. కేంద్రీయ సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీతల దర్శకత్వంలో అత్యంత మనోరంజకంగా నాటకాన్ని ప్రదర్శించారు. పాతాళ భైరవిగా ఆర్.శ్రీదేవి, తోట రాముడిగా శుభకర్, ఇందుమతిగా శాంతి, మాంత్రికుడిగా ఎస్.ఏ.శివశంకర్, యక్షిణిగా లక్ష్మీ, రాజాగా దినకర్, సీను మహారాజ్‌గా వి.ఉపేందర్, చంపగా వినమ్రవైనవి, నలినిగా మంజుమోహిని, పూజారిగా ఎస్.సుబ్బారావులు నటించారు.

అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు


బాధిత కుటుంబసభ్యులను ఓదారుస్తున్న దైద రవీందర్

నకిరేకల్ : విద్యుదాఘాతంతో మృతిచెందిన నకిరేకల్ మండలం ఓగోడు గ్రామానికి చెందిన మామ అల్లుళ్లు మాద వీరేందర్, భూపతి జానయ్య మృతదేహాలకు శుక్రవారం అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. మాద వీరేందర్, భూపతి జానయ్య భార్యలు పావని, ఉపేంద్ర ఫిర్యాదు మేరకు పోలీసులు వేర్వేరుగా కేసులు నమోదు చేశారు. మృతదేహాలకు నకిరేకల్ ఏరియా ఆస్పత్రిలో డాక్టర్లు పోస్టుమార్టం నిర్వహించి వారి కుటుంబసభ్యులకు అప్పగించారు. అనంతరం వారి స్వగ్రామం ఓగోడుకు తరలించారు. మృతదేహాలను చూసేందుకు ఓగోడు, పక్కనే ఉన్న నడిగూడెం, వల్లభాపురం, పాలెం గ్రామ ప్రజలు కూడా వచ్చి కన్నీటి వీడ్కోలు పలికారు. మాద వీరేందర్, భూపతి జానయ్య మృతదేహాలను కాంగ్రెస్ నేత దైద రవీందర్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ఫార్మా కంపెనీలకు అనుమతి ఇచ్చేది లేదు

- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు: ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే ఫార్మా కంపెనీలకు మునుగోడు నియోజకవర్గంలో అనుమతి ఇచ్చే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం మునుగోడులోని తన క్యాంపు కార్యాలయంలో కాలుష్య నియంత్రణ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునుగోడు నియోజకవర్గంలో కాలుష్యం వెదజల్లే రెడ్ కేటగిరి కంపెనీలకు ఎన్ని నోటీసులు ఇచ్చారని ప్రశ్నించారు. అదేవిధంగా కంపెనీల సీఎస్ఆర్ నిధులు ఎక్కడెక్కడ ఖర్చు చేశారని అడిగి తెలుసుకున్నారు. నూతనంగా నిర్మిస్తున్న మునుగోడు మండలంలోని కిష్టాపురం, గట్టుప్పల్ మండల కేంద్రంలోని ఫార్మా కంపెనీల పనులను వెంటనే నిలిపివేయాలని ఆదేశించారు. ప్రజల ఆరోగ్యం కాపాడడమే తన ప్రధాన కర్తవ్యమని, అందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. నియోజకవర్గంలో కాలుష్యం వెదజల్లే కంపెనీల వివరాలను పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి మరో వారం రోజుల్లో నిర్వహించే సమీక్ష సమావేశానికి ప్రతి ఉద్యోగి హాజరుకావాలని సూచించారు.

వీఐపీ టికెట్లు రీసైక్లింగ్ చేస్తున్న వ్యక్తిపై ఫిర్యాదు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో వీఐపీ రూ.150 టికెట్లను భక్తుల నుంచి సేకరించి, అదే టికెట్లను వేరే భక్తులకు విక్రయిస్తున్న వ్యక్తిపై యాదగిరిగుట్ట పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు శుక్రవారం ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. వివరాలు.. యాదాద్రీశుడి దర్శనానికి హైదరాబాద్‌కు చెందిన సుధాకర్ గురువారం తన కుటుంబ సభ్యులతో కలిసి మినీ బస్సులో వచ్చారు. సుధాకర్‌తోపాటు కుటుంబ సభ్యులు రూ.150 టికెట్ తీసుకొని గోల్డెన్ క్యూలైన్‌లో వెళ్తున్న సమయంలో కొబ్బరికాయలు కొట్టే ప్రదేశంలో అర్ధభాగం కొబ్బరిచిప్పల సేకరణ కాంట్రాక్టర్ వద్ద పనిచేసే టంటం వెంకటేష్ భక్తుల వద్ద టికెట్లను తీసుకున్నాడు. ఈ విషయాన్ని మహా ద్వారం వద్ద విధుల్లో ఉన్న ఎస్పీఎఫ్ సిబ్బందికి భక్తుడు సుధాకర్ తెలియజేశాడు. వెంటనే ఎస్పీఎఫ్ సిబ్బంది గోల్డెన్ క్యూలైన్ వద్దకు వెళ్లి తనిఖీ చేయగా టంటం వెంకటేష్ వద్ద టికెట్లు ఉన్నట్లు గుర్తించారు. వెంకటేష్ భక్తుల వద్ద రూ.150 టికెట్లను తీసుకొని వేరే భక్తులకు విక్రయిస్తున్నట్లు ఎస్పీఎఫ్ పోలీసులు గుర్తించారు. వెంకటేష్.. భక్తుల నుంచి అక్రమంగా టిక్కెట్లు తీసుకుని, దేవస్థానానికి ఆర్థిక నష్టం కలిగించి, అవకతవకలకు పాల్పడుతున్నట్లు ఈఓ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వెంకటేష్‌పై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని యాదగిరిగుట్ట పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఈఓ భాస్కర్‌రావు సూచనతో అధికారులు ఫిర్యాదు చేశారు. అంతే కాకుండా అర్ధభాగం కొబ్బరిచిప్పల సేకరణ కాంట్రాక్టర్ బిట్టు కిశోర్ టెండర్‌ను రద్దు చేయాలని నోటీసులు సైతం జారీ చేసినట్లు ఈఓ పేర్కొన్నారు.

క్లుప్తంగా

నేడు రైతుబంధుపై ప్రత్యేక సమావేశాలు

చిట్యాల : మండలంలోని చిట్యాల, వెలిమినేడు గ్రామాల పరిధిలోని పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో రైతు బంధు పథకంపై శనివారం ప్రత్యేక సర్వసభ్య సమావేశాలను నిర్వహించనున్నట్లు ఆ సంఘాల చైర్మన్‌లు సుంకరి మల్లేష్‌గౌడ్, ఏనుగు రఘుమారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశాలకు డీసీఓ హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశంలో రైతు బంధు పథకంపై రైతుల ద్వారా సలహాలు, సూచనలు, అభిప్రాయాలను సేకరించి, ప్రభుత్వానికి నివేదిక ద్వారా అందించనున్నట్లు చైర్మన్‌లు తెలిపారు. ఈ సమావేశాలలో సొసైటీ పాలకవర్గ సభ్యులతో పాటు రైతులు హాజరు కావాలని కోరారు.

పోటీ పరీక్షలపై అవగాహన సదస్సు

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ పట్టణంలో మైత్రి అకాడమి ఆధ్వర్యంలో జూన్ 30నుంచి జులై 2వతేదీ వరకు వివిధ పోటీ పరీక్షలపై ఉచిత అవగాహన తరగతులు నిర్వహించనున్నట్లు సంస్థ డైరెక్టర్లు పాముల అశోక్, వంటల రాకేష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మారుతున్న పోటీ పరీక్షలకు అనుగుణంగా అనుభవజ్ఞులైన అధ్యాపకులు అభ్యర్థులకు సలహాలు సూచనలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు అవగాహన సదస్సును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9063686368, 9052888852ను సంప్రదించాలన్నారు.

మంత్రి కోమటిరెడ్డి దంపతులకు సన్మానం



మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి

నల్లగొండ టౌన్ : ఉమ్మడి నల్లగొండ జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం చైర్మన్‌గా ఇటీవల ఎన్నికైన బోళ్ల వెంకట్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దంపతులను సన్మానించారు. చైర్మన్‌గా ఎన్నిక కావడానికి సహకరించినందుకు మంత్రికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఉన్నారు.

అసదుద్దీన్ ఓవైసీ ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేయాలి

మర్రిగూడ : భారత పార్లమెంట్‌లో జైపాలస్తీనా అని నినాదం చేసిన హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ సభ్యత్వాన్ని రద్దు చేసి అతడిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు నారోజు కుమారస్వామిచారి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విషయాన్ని రాష్ట్రపతి, స్పీకర్, సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించి కేసు నమోదు చేసి అసదుద్దీన్ ఓవైసీ ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

చండూరు : మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024– 2025 విద్యాసంవత్సరానికి గాను ఖాళీగా ఉన్న కంప్యూటర్ అప్లికేషన్ సబ్జెక్ట్ బోధించడానికి (అతిథి అధ్యాపకులు) ఆసక్తి కలిగిన అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రధాన ఆచార్యులు డాక్టర్ బి.నరసింహ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సంబంధిత పీజీ సబ్జెక్టులలో 55శాతం మార్కులతో ఉత్తీర్ణత (ఎస్సీ, ఎస్టీలకు 50%), ఎస్ఈటీ, ఎన్ఈటీ, పీహెచ్‌డీ కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యం, కళాశాలలో బోధన అనుభవానికి అదనపు మార్కులు ఉంటాయని తెలిపారు.

పాల ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్‌గా యాదగిరిరెడ్డి



గుత్తా యాదగిరిరెడ్డి

చిట్యాల : మండలంలోని ఎలికట్టె గ్రామంలో పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం ఎన్నికలు శుక్రవారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం చైర్మన్‌గా గుత్తా యాదగిరిరెడ్డి, డైరెక్టర్‌లుగా సైదులు, మెట్టు మల్లయ్య, యాదగిరిరెడ్డి, ఉయ్యాల స్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాగా గుత్తా యాదగిరిరెడ్డి 1990 నుంచి వరుసగా 35ఏళ్లుగా గ్రామ పాల ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్‌గా ఎన్నికవుతూ వస్తున్నారు. అనంతరం నూతన పాలకవర్గ సభ్యులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుడిపాటి లక్ష్మీనర్సింహ, ఎంపీటీసీ గోలనుగొండ దశరథ, మాజీ సర్పంచ్‌లు ఉయ్యాల సత్తయ్య, మాజీ ఉపసర్పంచ్ సాగర్ల యాదయ్య, మాజీ ఎంపీటీసీ పోలగోని సత్తయ్య అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో సంఘం డైరెక్టర్‌లు ఉయ్యాల లింగయ్య, సంజీవ, కొండకింది వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు యాదగిరిచారి, కాటం వెంకన్న, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు అందక జీపీ కార్మికుల అవస్థలు

- పంచాయతీల్లో నిధుల కొరత
- అప్పులు చేసి పూట గడుపుతున్నామని కార్మికుల ఆందోళన



శివన్నగూడ గ్రామపంచాయతీ

మర్రిగూడ : గ్రామాల్లో చెత్తను సేకరిస్తూ ప్రతి వీధిని శుభ్రపరుస్తూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్న గ్రామపంచాయతీ సిబ్బందికి సక్రమంగా వేతనాలు అందక అర్ధాకలితో అలమటిస్తున్నారు. అప్పులు తెచ్చుకుని కాలం వెల్లదీసే పరిస్థితి ఏర్పడిందని మర్రిగూడ మండలంలోని పలు గ్రామాల పంచాయతీ కార్మికులు వాపోతున్నారు.

ఇబ్బందిగా మారిన కుటుంబ పోషణ

మర్రిగూడ మండలంలోని 18 గ్రామపంచాయతీల్లో 80 నుంచి 90 మంది వరకు కార్మికులు పనిచేస్తున్నారు. కొన్ని గ్రామపంచాయతీల్లో సిబ్బందికి 3 నెలల నుంచి 5 నెలల వరకు వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆందోళన చెందుతున్నారు. ఈ నెల చివరి వారం ముగిస్తే శివన్నగూడ గ్రామ పంచాయతీ సిబ్బందికి 6 నెలలు, కొట్టాల సిబ్బందికి 5 నెలలు, ఖుదాబాక్షపల్లి, మర్రిగూడ పంచాయతీల సిబ్బందికి 4 నెలల చొప్పున, మరికొన్ని గ్రామపంచాయతీల్లో 2 నుంచి 3 నెలల వేతనాలు అందలేదు. వేతనాలు అందకపోవడంతో కుటుంబ పోషణకు ఇబ్బందిగా మారిందని గ్రామ పంచాయతీ కార్మికులు కంటతడి పెట్టుకుంటున్నారు.

మల్టీపర్పస్ కార్మికులుగా పనులు...

గ్రామపంచాయతీ కార్మికులు గ్రామాల్లో నిత్యం చెత్త సేకరణ, వీధులను శుభ్రం చేయడం, తాగు నీటి సరఫరా, మురుగు కాల్వల పరిశుభ్రత, వీధి దీపాల నిర్వహణ, డంపింగ్ యార్డులు, నర్సరీల్లో పనులు చేయడంతోపాటు గ్రామ రహదారుల వెంట నాటిన మొక్కలకు నీటి ట్యాంకర్ల ద్వారా నీరు పెట్టడం ఇలా అన్ని రకాల పనులు చేస్తున్నారు. ఇన్ని పనులు చేసినా తమకు గ్రామ పంచాయతీల్లో వేతనాలు చెల్లించేందుకు నిధులు లేవని అధికారులు చెప్పడంపై కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు ఇకనైనా స్పందించి తమకు వేతనాలు నెలనెలా అందించేవిధంగా చొరవ చూపాలని కోరుతున్నారు.

కార్మికుల డిమాండ్‌లు..

గత ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించగా ప్రస్తుత ప్రభుత్వంపై పంచాయతీ కార్మికులు ఆశలు పెట్టుకున్నారు. పెండింగ్ వేతనాలను తక్షణమే విడుదల చేయాలని వారు కోరుతున్నారు. జీఓ నంబర్.51 మల్టీపర్పస్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కార్మికులకు గుర్తింపు కార్డులతోపాటు కనీసం వేతనం రూ.26వేలు చెల్లించాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, మృతిచెందిన కార్మికులకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని కోరుతున్నారు.

ఆరు నెలలు గడుస్తోంది



"మరో రెండు రోజులైతే జీతాలు చెల్లించక ఆరు నెలలు గడుస్తుంది. ఉదయం మొదలుకుని సాయంత్రం వరకు పనులు చేస్తాం. జీతాలు లేకపోయేసరికి పూట గడవక కష్టంగా ఉంది. జీతాలు అందించేవిధంగా అధికారులు చొరవ చూపి ఆదుకోవాలి.
–ఊరిపక్క లింగయ్య, జీపీ కార్మికుడు, శివన్నగూడ

పని భారం పెరిగింది

"నేను మల్టీపర్పస్ వర్కర్‌గా పనిచేస్తూ ట్రాక్టర్ డ్రైవింగ్ చేస్తాను. ఉన్న సిబ్బందికి పనిభారం పెరగడంతో ఒక్కడినే ట్రాక్టర్ నడుపుతూ ఇళ్లలోని చెత్తను సేకరిస్తున్నా. చెత్త సేకరించేటప్పుడు ట్రాక్టర్ వెంట మరో సిబ్బంది ఉంటే పనులు సులభతరమవుతుంది.
– నల్లవెల్లి యాదయ్య, జీపీ కార్మికుడు, రాంరెడ్డిపల్లి

పంచాయతీలో నిధులు లేవు



"ప్రస్తుతం జీపీలో నిధులు లేకపోవడంతో వేతనాలు అందించడం ఆలస్యమవుతోంది. గ్రామ పంచాయతీ కార్మికులకు త్వరలోనే వేతనాలు అందించే విధంగా చర్యలు తీసుకుంటాం
–బక్క శ్రీనివాసులు, శివన్నగూడ ప్రత్యేకాధికారి, తహసీల్దార్

ప్రాజెక్టు పనుల్లో అవినీతి సొమ్మును రాబడతాం

- ఎమ్మెల్యే మందుల సామేల్



రాచకాల్వపై ధ్వంసమైన షట్టర్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్, నాయకులు

శాలిగౌరారం : శాలిగౌరారం ప్రాజెక్టు అభివృద్ధి పనుల్లో జరిగిన అవినీతి సొమ్మును రాబడుతామని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరువచ్చే రాచకాల్వను నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలు నుంచి రామన్నపేట మండలం పల్లివాడ వరకు సుమారు 15కిలోమీటర్లు ఆయన ప్రాజెక్టు ఆయకట్టు రైతులతో కలిసి పరిశీలించారు. అనంతరం నీటిపారుదల శాఖ ఈఎన్‌సీకి ఫోన్ చేసి కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నిలిచిపోయిన ప్రాజెక్టు అభివృద్ధి పనులు తదితర అంశాలను చర్చించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. 115సంవత్సరాల చరిత్ర కలిగిన శాలిగౌరారం ప్రాజెక్టు సంబంధించిన రాచకాల్వ కింద సుమారు 20వేల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉందన్నారు. శాలిగౌరారం ప్రాజెక్టు అభివృద్ధి కోసం సుమారు నాలుగు సంవత్సరాల క్రితం నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.5.10కోట్లు నిధులు మంజూరు చేసిందన్నారు. కానీ నాటి పాలకుల వైఫల్యం, అధికారుల ఉదాసీనతతో ప్రాజెక్టు అభివృద్ధి 25శాతం కూడా జరుగలేదన్నారు. సంబంధిత కాంట్రాక్టర్ రూ.2కోట్ల మేర పనులు జరిపినట్లు రికార్డులు తయారు చేసి బిల్లులు పొందారన్నారు. రూ.2కోట్ల విలువ కలిగిన పనులు జరుగకున్నా కాంట్రాక్టర్‌కు బిల్లుల చెల్లింపులో నాటి పాలకులు, నీటిపారుదలశాఖ అధికారులు సహకరించి నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారన్నారు. ప్రాజెక్టు అభివృద్ధి పనుల్లో జరిగిన నిధుల దుర్వినియోగంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి తిన్న అవినీతి సొమ్మును కక్కిస్తామన్నారు. ప్రాజెక్టు అభివృద్ధి పనుల నిర్వహణను నిర్లక్ష్యంగా, నాణ్యతాలోపంగా చేపట్టిన సదరు కాంట్రాక్టర్ నుంచి తొలగించి మరో కాంట్రాక్టర్‌ను ఎంపిక చేసి పనులను అప్పగించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో నీటిపారుదలశాఖ ఈఈ విజయ్‌కుమార్, డీఈఈ సత్యనారాయణ, ఏఈలు రాములు, అమర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, నాయకులు చామల వెంకటరమణారెడ్డి, జయపాల్‌రెడ్డి, చాడ సురేశ్‌రెడ్డి, గూని వెంకటయ్య, చింత ధనుంజయ్య, సామ చంద్రారెడ్డి, ననుబోతు అంజయ్య, భూపతి వెంకటేశ్వర్లు, శంకర్, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

శాలిగౌరారం : మండల కేంద్రంలోని 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం నూతన 132కేవీ లైన్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో వంగమర్తి, మాధారంకలాన్, ఇటుకులపహాడ్, పావురాలగూడెం, అడ్లూరు, ఊట్కూరు, పెర్కకొండారం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మండల విద్యుత్ ట్రాన్స్‌కో ఏఈ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లో ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు సరఫరా నిలపనున్నట్లు తెలిపారు. అందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

రైతుభరోసా, రుణమాఫీ రైతులందరికీ వర్తింపజేయాలి

నల్లగొండ టౌన్ : కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా, రెండు లక్షల రుణమాఫీని రైతులందరికీ వర్తింపజేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి తీగల సాగర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక దొడ్డి కొమరయ్య భవన్‌లో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలన్నారు. వానాకాలం సీజన్ ఆరంభమైనందున పెట్టుబడి కోసం రైతుభరోసా విడుదల చేయాలన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, బండ శ్రీశైలం, నర్సింహ, అశోక్‌రెడ్డి, మంగా రెడ్డి, శ్రీను, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులు అందజేస్తున్న సాయి సేవకులు

చిట్యాల : మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డుకు చెందిన వృద్ధురాలు ఎస్‌కె.లాల్‌బీ పక్షవాతంతో తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో ఆమెకు శ్రీసత్యసాయి సేవా సంస్థ సభ్యులు శుక్రవారం వివిధ రకాల నిత్యావసర సరుకులు అందజేశారు. అదే విధంగా వార్డు కౌన్సిలర్ బెల్లి సత్తయ్య ఆధ్వర్యంలో పలువురు ఇచ్చిన రూ.7,200 నగదును వృద్ధురాలి మెడిసిన్ కొనుగోలుకు అందజేశారు. కార్యక్రమంలో సాయి సేవకులు మేడిశెట్టి ఝాన్సీ, చందా నాగలక్ష్మి, మేడిశెట్టి అంజయ్య, చందా వెంకటేశ్వర్లు, బెల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందజేస్తున్న స్నేహితులు

శాలిగౌరారం : మండలంలోని మాధారంకలాన్ గ్రామానికి చెందిన ఉంద్రాతి కళమ్మ తండ్రి ఇటీవల మృతి చెందాడు. విషయాన్ని తెలుసుకున్న కళమ్మ చిన్ననాటి స్నేహితులు రూ.5వేలు జమచేసి శుక్రవారం ఆర్థికసాయంగా అందజేశారు. వారిలో రమ, శంకరమ్మ, జ్యోతి, ప్రీతి, మమత, తదితరులు ఉన్నారు.

సౌకర్యాలు కల్పించాలి

సంస్థాన్ నారాయణపురం: దివ్యాంగులకు సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ మస్క్యులర్ డిస్ట్రోఫీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కత్తుల బాలకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. సంఘం సమావేశం శుక్రవారం లింగవారిగూడెంలో నిర్వహించి మాట్లాడారు. తీవ్ర వైకల్యం కల్గిన వారికి కేర్‌టేకర్ నియమించాలని, హెల్త్‌కార్డు, పౌష్టికాహారం, పింఛను పెంపు వంటి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

పేద ప్రజలకు సేవలందించడమే లక్ష్యం



కుట్టుమిషన్ల పంపిణీలో పాల్గొన్న లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ బాబురావు

నల్లగొండ టౌన్ : పేద ప్రజలకు సేవలందించడమే లయన్స్ క్లబ్ లక్ష్యమని ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ ఘట్టమనేని బాబురావు అన్నారు. శుక్రవారం పట్టణంలో లయన్స్ క్లబ్ నల్లగొండ గోల్డెన్ జూబ్లీ, చాప్టర్ నైట్ వేడుకలను జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. లయన్స్ క్లబ్ ద్వారా అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ముున్ముందు గ్రామగ్రామానికి క్లబ్ సేవలను విస్తరిస్తామన్నారు. ఈ సందర్భంగా 50 కుట్టుమిషన్లను 50 బెంచీలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా గవర్నర్ లయన్ సీహెచ్‌వీ శివప్రసాద్, ప్రస్తుత గవర్నర్ యారాల ప్రభాకర్‌రెడ్డి, కౌన్సిల్ నాయకులు, నలగొండ జిల్లా పూర్వ గవర్నర్లు జగిని భీమయ్య, గోలి అమరేందర్‌రెడ్డి, నేతి రఘుపతి, కేవీ ప్రసాద్, అధ్యక్షుడు ఎల్‌వీ కుమార్, ఉపాధ్యక్షులు నిమ్మల పిచ్చయ్య, వీరవెల్లి సత్యనారాయణ, మందడి శంకర్‌రెడ్డి, ఎర్రమాద శ్రీనివాస్, రీజనల్ చైర్మన్ గట్టుపల్లి అశోక్‌రెడ్డి, వివిధ క్లబ్‌ల ప్రతినిధులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు గ్రామాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గీత

చండూరు : గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీపీ అవ్వారి గీతా శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన చివరి సర్వసభ్య సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. వర్షాకాలం మొదలైనందున గ్రామాల్లో జ్వరాలు, అంటు వ్యాధులు ప్రబలకుండా వైద్యాధికారులతో పాటు గ్రామ, మండల స్థాయి అధికారులు కలసి పనిచేస్తూ నివారణకు కృషి చేయాలని సూచించారు. గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆవరణను శుభ్రంగా ఉంచుకోవాలసిన బాధ్యత ప్రత్యేక అధికారులదే అన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అదే విధంగా గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, కుక్కలను నివారించాలని ఎంపీటీసీలు సభదృష్టికి తీసుకొచ్చారు. బోడంగిపర్తి పరిధిలో మిషన్ భగీరథ నీరు రావడం లేదని సభలో గ్రామ ఎంపీటీసీ వివరించారు. అనంతరం జెడ్పీటీసీ, ఎంపీటీసీలను అధికారులు ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. సమావేశంలో జెడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, ఎంపీడీఓ అనురాధ, తహసీల్దార్ దశరథ, డిప్యూటీ తహసీల్దార్ నిర్మలాదేవి, ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ మనోహర్, పంచాయతీరాజ్ ఏఈ రమేష్, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ధర్నా



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్తులు

నకిరేకల్ : ఇళ్లు లేని నిరుపేదలకు ప్రభుత్వ భూముల్లో స్థలాలు కేటాయించి ఇళ్లను నిర్మించి ఇవ్వాలని పీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి డిమాండ్ చేశారు. ఈ సందరర్భంగా మండలంలోని నోముల గ్రామస్తులు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. 50ఏళ్ల క్రితం ఈగ్రామంలో పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఇచ్చారని గుర్తుచేశారు. అప్పటి నుంచి నేటికి ఇవ్వకపోవడంతో నిరుపేదలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు గ్యార సాలయ్య, కాండిగు సైదులు, మధుగౌడ్, ఎకాల శ్రీనివాస్, కన్నెబోయిన శ్రీనివాస్, మాచర్ల సంతోష, శ్రావణి, ఎర్ర ప్రమీలా, ఎర్ర రేణుక, కోమరెల్లి నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

రైతుభరోసా అందించడంలో కాలయాపన



మాట్లాడుతున్న గోలి మధుసూదన్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు సకాలంలో రైతుభరోసా ఇవ్వకుండా కాలయాపన చేస్తుందని బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన కిసాన్ మోర్చా జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ ఒకేసారి చేసి, ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతు భరోసా ఎకరానికి ఏడాదికి రూ.15వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయిల్‌పామ్ రైతులకు ఇచ్చే సహాయం రూ.10,500 వెంటనే విడుదల చేయాలన్నారు. జిల్లాలో ఇసుక అక్రమ రవాణా అరికట్టి భూగర్భ జలాలను పరిరక్షించాలన్నారు. వచ్చే నెల 10లోగా రైతుల డిమాండ్లు నెరవేర్చకపోతే కలెక్టరేట్ ఎదుట నిరహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు గుర్రం వెంకట్‌రెడ్డి, కోశాధికారి కన్మంతరెడ్డి అశోక్‌రెడ్డి, భవనం మధుసూదన్‌రెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షుడు చల్లమల్ల సీతారాంరెడ్డి, గుండా నవీన్‌రెడ్డి, పాదూరి వెంకట్‌రెడ్డి, పోలోజు భిక్షమాచారి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలి



సర్టిఫికెట్లు అందుకున్న క్రీడాకారులతో అధికారులు, కోచ్‌లు

నల్లగొండ టూటౌన్ : విద్యార్థులు తమకు నచ్చిన క్రీడల్లో నిరంతర సాధన చేసి క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలని ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మపాల గిరిబాబు అన్నారు. పట్టణంలోని మేకల అభినవ్ ఔట్‌డోర్ స్టేడియంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న హాకీ, ఫుట్‌బాల్, క్రికెట్, తైక్వాండో క్రీడాకారులకు శుక్రవారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వేసవి శిక్షణ శిబిరాల్లో పాల్గొనడం ద్వారా క్రీడాకారులకు క్రీడల పట్ల మక్కువ పెరుగుతుందన్నారు. ఈ సర్టిఫికెట్లు వారికి ఎంతో ఉపయోగపడుతాయని, జిల్లాలో క్రీడాకారులను ప్రోత్సహించడానికి తమ సంఘం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి మక్బుల్‌అహ్మద్, కోచ్‌లు మద్ది కర్నాకర్, అంబటి ప్రణీత్, సోమన్, కత్తుల హరి పాల్గొన్నారు.

కస్తూరిబా పాఠశాలలో డీఈఓ ఆకస్మిక తనిఖీ



మునుగోడు : కస్తూరిబా బాలికల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ

మునుగోడు : పట్టణంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) శుక్రవారం నల్లగొండ డీఈఓ బొల్లారం భిక్షపతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యాలయంలోని తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థినుల ప్రతిభను పరిశీలించారు. విద్యాబోధనతో పాటు పాఠశాలలో నెలకొన్న ఇతర సమస్యలను ఆయన విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినులకు అందించే భోజనాన్ని పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధనను ఉపాధ్యాయులు అందించాలన్నారు. మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో కమిటీల ద్వారా జరుగుతున్న మరమ్మతులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ సంధ్యారాణి, ఉపాధ్యాయురాలు పాల్గొన్నారు.

జూలై 3న డీఎంఈ కార్యాలయం ముట్టడి



సమావేశంలో మాట్లాడుతున్న దేవేందర్‌రెడ్డి

నల్లగొండ టౌన్ : ఆస్పత్రి కార్మికుల వేతనాల పెంపు కోసం జూలై 3న తలపెట్టిన డీఎంఈ(డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ హైదరాబాద్) కార్యాలయ ముట్టడిలో కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక జీజీహెచ్ ఎదుట నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులకు నెలనెలా వేతనాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు యాదగిరి, ఎల్లమ్మ, పద్మ, సబిత, మణెమ్మ, మల్లిక, విజయ, వెంకటమ్మ, శ్రీదేవి, పార్వతమ్మ, మౌలాబి, నాగమణి, అరుణ, విజయ, రేణుక, భాగ్యమ్మ, దేవేందర్ పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జి.దామోదర్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.దామోదర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నల్లగొండలోని పెన్షనర్స్ భవన్‌లో నిర్వహించిన సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పెన్షనర్లకు రావాల్సిన డీఏ, పీఆర్సీ వెంటనే ప్రకటించాలన్నారు. పెన్షనర్ల సమస్యలపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు జి.వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జెల్లా శ్రీశైలం, ఎస్.అమృతారెడ్డి, గాయం నారాయణరెడ్డి, మోహన్‌రావు, వివిధ మండలాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

జూలై 7నుంచి నేతన్న పోరుగర్జన యాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న గంజి మురళీధర్

నల్లగొండ టౌన్ : 'మగ్గం నడవాలి నేతన్న బతకాలి' అనే నినాదంలో చేనేత వృత్తి రక్షణ, వృత్తిదారుల సంక్షేమం చేపట్టాలని డిమాండ్ చేస్తూ జూలై 7నుంచి 15వరకు చేపట్టనున్న నేతన్న పోరుగర్జన యాత్రను జయప్రదం చేయాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్, పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి దండెంపల్లి సత్తయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో నిర్వహించిన సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కందకట్ల గణేష్, గంజి నాగరాజు, కర్నాటి శ్రీరంగం, గద్దం దశరథ, సూరపల్లి భద్రయ్య, మధు, శంకరయ్య, ఏలె శ్రీనివాస్, అద్దంకి నర్సింహ, సైదాచారి తదితరులు పాల్గొన్నారు.

రేపు మెగా టాలెంట్ టెస్ట్

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని అశోక్‌నగర్‌లో కేవీఆర్ నవోదయ సెంటర్‌లో ఈనెల 30న మెగా టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించనున్నట్లు కేవీఆర్ సంస్థ ఇన్‌చార్జ్ కాతోజు వినోద్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ టాలెంట్ టెస్ట్ ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. 4, 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు మెగా టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభను చాటితే కేవీఆర్ నవోదయ ఎంట్రన్స్ కోచింగ్ సెంటర్లలో ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. అదే విధంగా ఈ కోచింగ్ సెంటర్లో హాస్టల్ వసతి సౌకర్యం కూడా ఉందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి సమాచారం కోసం ఫోన్ నంబరు 9010894070ను సంప్రదించాలని కోరారు.

గురుకుల భవనాలు ప్రారంభించాలి

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని సర్వేల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన గురుకుల భవనాలను వెంటనే ప్రారంభించాలని బీసీ యువజన సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు వీరమళ్ల కార్తిక్ ప్రభుత్వాన్ని కోరారు. సర్వేల్‌లో నిర్మించిన భవనాలను శుక్రవారం సంఘం మండల అధ్యక్షుడు కొప్పు రామకృష్ణ, నవీన్‌తో కలిసి పరిశీలించారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండ చూడాలన్నారు.